సాక్షి
జనగామ
ఆదివారం । 24 । సెప్టెంబర్ । 2023



మళ్లీ మొదటికి.. - 8లో▸
గ్రూప్–1 ఉద్యోగాల భర్తీ మళ్లీ మొదటికి వచ్చింది. గతంలో నిర్వహించిన ప్రిలిమ్స్ రద్దు చేస్తున్నాం. మళ్లీ రాయాలని హైకోర్టు తీర్పు ఇవ్వడంతో అభ్యర్థులు కన్నీరుమున్నీరవుతున్నారు.



పేదల వ్యతిరేక ప్రభుత్వాలను..
పేదల వ్యతిరేక కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఓడించాలని రిటైర్డ్ ఐఏఎస్ ఆకునూరి మురళి పిలుపునిచ్చారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
32^0 / 25^0

వాతావరణం
జిల్లాలో ఉదయం చల్లని వాతావరణం ఉంటుంది. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా జల్లులు కురిసే అవకాశం ఉంది. మధ్యాహ్నం ఉష్ణోగ్రతలు తగ్గుతాయి.

న్యూస్‌రీల్

వైభవంగా వార కల్యాణం



చిల్పూరు: శ్రీ బుగులు వేంకటేశ్వరస్వామి సన్నిధిలో శనివారం వార కల్యాణం వైభవంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. హనుమకొండకు చెందిన నెల్లల సోమేశ్వరరావు–కృష్ణవేణి దంపతులు భక్తులకు అన్నప్రసాదం ఏర్పాటు చేశారు. ఆలయ ఈఓ భాగం లక్ష్మీప్రసన్న, చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు ఆధ్వర్యంలో అర్చకులు నిర్వహించిన ఈ కల్యాణ వేడుకలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ చిర్రనాగరాజు, కుంచాల సంపత్‌రాజు, వేల్పుల గట్టయ్య, జంగిటి కుమార్, శ్యాంసుందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ సివిల్ జడ్జి బదిలీ

జనగామ రూరల్: జిల్లా అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి సీహెచ్.నర్మద బదిలీపై రంగారెడ్డి జిల్లా కోర్టు ఎల్బీనగర్ ఫస్ట్ అడిషనల్ జూనియర్ జడ్జిగా వెళ్లారు. ఈ మేరకు శనివారం హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. నర్మద స్థానంలో వస్తున్న జడ్జి కొప్పుల సందీప అక్టోబర్ 4వ జాయిన్ కానున్నారు.

సమ్మె నోటీసుల అందజేత

జనగామ రూరల్: జీపీ కార్మికులు గతంలో చేపట్టిన సమ్మెతో సమస్యలు పరిష్కారం కాకపోవడంతో మరోమారు సమ్మెకు సిద్ధమవుతున్నారని జీపీ కార్మికుల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు రాపర్తి రాజు అన్నారు. శనివారం కలెక్టర్ శివలింగయ్యతోపాటు డీపీఓ కార్యాలయంలో సమ్మె నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో 38 రోజులు సమ్మె చేస్తే రెండు రోజుల్లో సమస్యలు పరిష్కరిస్తామని నేటికీ పట్టించుకోకపోవడం దారుణమన్నారు. డిమాండ్లు నెరవేర్చకపోతే అక్టోబర్ 2వ తేదీ నుంచి సమ్మెకు వెళ్తామని స్పష్టం చేశారు.

తల్లిదండ్రుల భాగస్వామ్యంతోనే ప్రగతి

జనగామ రూరల్: తల్లిదండ్రుల భాగస్వామ్యంతోనే విద్యార్థుల సమగ్రాభివృద్ధి, పాఠశాల ప్రగతి సాధ్యమని రాష్ట్ర పరిశీలకురాలు విజయలక్ష్మి అన్నారు. జిల్లా వ్యాప్తంగా పాఠశాలల ప్రగతిపై శనివారం పేరెంట్స్ సమావేశం నిర్వహించారు. యశ్వాంతాపూర్ ఎంపీపీఎస్‌లో మాట్లాడుతూ.. విద్యార్థుల చదువు విషయంలో పాఠశాలలో ఉపాధ్యాయులు, ఇంటి వద్ద తల్లిదండ్రులు దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో డీఈఓ రాము, సీఎంఓ నర్సింహారావు, రామరాజు పాల్గొన్నారు.

విద్యార్థుల చదువులపై శ్రద్ధ పెట్టాలి
పాఠశాలల్లోనే కాకుండా విద్యార్థులను ఇంటి వద్ద చదువుకునేలా తల్లిదండ్రులు కృషి చేయాలని డీఈఓ రాము అన్నారు. శనివారం పట్టణంలోని గణేష్‌వాడ ఎంపీపీఎస్ పాఠశాలలో ఏర్పాటు చేసిన పేరెంట్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు.

కార్మికుల సంక్షేమానికి కృషి

జనగామ : ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేసే కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తున్నదని మార్కెట్ చైర్మన్ బాల్దె సిద్దిలింగం అన్నారు. శనివారం జనగామ వ్యవసాయ మార్కెట్ ఆవరణలో హమాలీ కార్మికులకు రెండు జతల యూనిఫాం, స్వీపర్లకు రెండు చీరెలు పంపిణీ చేశారు. అనంతరం మార్కెట్‌లో నిర్వహిస్తున్న గణేష్ ఉత్సవాల్లో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

పంట నష్టపరిహారం విడుదల

జిల్లాకు రూ.36.69 కోట్లు
రెండ్రోజుల్లో రైతుల ఖాతాల్లో జమ

జనగామ: జిల్లాలో ఈ ఏడాది యాసంగి సీజన్‌లో కురిసిన వడగళ్ల వానకు నష్టపోయిన, దెబ్బతిన్న పంటలకు ప్రభుత్వం పరిహారం మంజూరు చేసింది. మార్చి 23 నుంచి ఏప్రిల్ 7 వరకు ప్రకృతి వైపరీత్యాలతో జరిగిన నష్టాన్ని వ్యవసాయ శాఖ నివేదిక రూపంలో ప్రభుత్వానికి సమర్పించింది. ఇందులో వరి, మొక్కజొన్న ఇతర పంటలకు సంబంధించి 20,160 మంది రైతులకు చెందిన 36,697 ఎకరాలకు రూ.36.69కోట్ల పరిహారాన్ని ప్రభుత్వం విడుదల చేసింది. ఒకటి, రెండు రోజుల్లో రైతుల ఖాతాల్లో పరిహారం సొమ్ము జమ అవుతుందని జిల్లా వ్యవసాధికారి వినోద్‌కుమార్ తెలిపారు. జనగామ మండలంలో రూ.9.10కోట్లు (రైతులు 4,909), నర్మెట రూ.8.56కోట్లు (5,026), తరిగొప్పుల రూ.1.01కోట్లు(726), కొడకండ్ల రూ.29.18లక్షలు (288), దేవరుప్పుల రూ.1.20లక్షలు (10), పాలకుర్తి రూ.8.88లక్షలు (51), స్టేషన్ ఘన్‌పూర్ రూ.23.35లక్షలు(234), చిల్పూరు రూ.44.06లక్షలు (441), జఫర్‌గఢ్ రూ.25వేలు (01), బచ్చన్నపేట రూ.13.88కోట్లు (5,890), లింగాలఘనపురం రూ.43.19లక్షలు (305), రఘునాథపల్లి రూ.2.62కోట్లు (2,279) పరిహారం వచ్చినట్లు డీఏఓ వినోద్‌కుమార్ పేర్కొన్నారు.

ఎక్కడి చెత్త అక్కడే..

కంపు కొడుతున్న కాలనీలు
- మురుగుతో నిండిన కాల్వలు
- గిర్నిగడ్డలో మూడు నెలలుగా తొలగించని చెత్త
- ప్రజలపై విజృంభిస్తున్న దోమలు
- జ్వరాలతో ఆస్పత్రులకు పరుగులు..
- పట్టణంలో డెంగీ కేసు నమోదు
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు

సాక్షి గ్రౌండ్ రిపోర్ట్

జనగామ మున్సిపాలిటీ పరిధిలో మొత్తం 30 వార్డులు ఉండగా 80 వేలకు పైగా జనాభా ఉంది. జిల్లా ఆస్పత్రి, మాతా శిశు సంరక్షణ కేంద్రం, అర్బన్ పీహెచ్‌సీ, ప్రైవేటు ఆస్పత్రులు 25 వరకు ఉన్నాయి. చాలా వార్డుల్లో పేరుకుపోయిన పారిశుద్ధ్య సమస్య కారణంగా ఈగలు, దోమలు వృద్ధి చెంది చిన్న పిల్లల నుంచి మొదలు వృద్ధుల వరకు జ్వరాలతో బాధపడుతున్నారు. ఏ ఆస్పత్రి చూసినా జ్వరపీడితులతో కిటకిటలాడుతోంది. కొన్ని ఆస్పత్రుల్లో చిన్న పిల్లల ఓపీ రోజుకు 200 పైగా నమోదవుతోంది. ఇటీవల ధర్మకంచ ప్రాంతంలో ఒక డెంగీ కేసు నమోదైంది.

పారిశుద్ధ్యం అస్తవ్యస్తం..

గిర్నిగడ్డ ఏరియాలో మూడు నెలల నుంచి పారిశుద్ధ్య పనులు చేపట్టకపోవడంతో చెత్త పేరుకుపోయింది. బాలాజీనగర్, కురుమవాడ, అండర్ బ్రిడ్జి ఏరియా, హైదరాబాద్‌రోడ్డులోని 2వ వార్డు, హౌసింగ్‌బోర్డు, శ్రీసాయి రెసిడెన్సీ, అంబేడ్కర్‌నగర్, జ్యోతినగర్, గోకుల్‌నగర్, జీఎమ్మార్ కాలనీ, 26వ వార్డులో డ్రెయినేజీలు సక్రమంగా లేక వ్యర్థాలు పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతోంది. హైదరాబాద్, సిద్దిపేటరోడ్డు, ప్రధాన డ్రెయినేజీల్లో సిల్ట్‌తో పాటు చెత్త పేరుకుపోయి చిన్న పాటి వర్షానికే మురుగు నీరంతా రోడ్డుపైకి చేరుతోంది. బాలాజీనగర్‌లో ఇళ్ల మధ్య నుంచి ఉన్న పెద్ద మురికి కాల్వ కారణంగా పరిసరాల ప్రజలు దోమల బెడదతో తల్లడిల్లుతున్నారు. మున్సిపల్ అధికారులు పారిశుద్ధ్య పనులు చేపట్టకపోగా.. దోమల నివారణ చర్యలు సైతం తీసుకోవడంలేదని ప్రజలు మండిపడుతున్నారు. చీకటి పడిందంటే డోర్లు క్లోజ్ చేసుకోవాల్సి వస్తోందని, సంబంధిత అధికారులకు ఫోన్ చేసి సమస్య చెప్పినా పట్టించుకోవడంలేదని పలువురు వాపోయారు.



బాలాజీనగర్ : ఇళ్ల మధ్య ఉన్న డ్రెయినేజీలో నిలిచిన మురుగు నీరు



దుర్గయ్య

పై చిత్రంలోని పెద్ద మురికి కాల్వ బాలాజీనగర్ ఏరియాలోనిది. అస్తవ్యస్తంగా తయారై ప్రమాదకరంగా ఉన్న ఈ కాల్వలో పేరుకుపోయిన చెత్త రోజుల తరబడి తొలగించడంలేదు. దీంతో దోమలు విపరీతంగా తయారయ్యాయి. 'దోమల నివారణకు మున్సిపాలిటీ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదు. కనీసం ఫాగింగ్, బ్లీచింగ్ పౌడర్ కూడా చల్లించడంలేదు. ఇళ్ల నుంచి బయటకు రాలేని పరిస్థితి. చిన్న పిల్లల విషయానికి వస్తే కాల్వలో పడిపోతారనే భయంతో కాపుకాయాల్సి వస్తోంది' అంటూ కొత్తపల్లి దుర్గయ్య ఆవేదన వ్యక్తం చేశారు.

మూడు నెలలుగా తొలగింపు లేదు



మా ఏరియాలో మూన్నెళ్ల నుంచి చెత్త తొలగించడం లేదు. దీంతో రోడ్డుపైన, ఖాళీ ప్రదేశాల్లో పడవేయడం వల్ల దుర్వాసన వస్తోంది. మున్సిపల్ జవాన్‌కు ఫోన్ చేసినా స్పందించడం లేదు. కౌన్సిలర్ కూడా పట్టించుకోవడం లేదు. చెత్త ఎక్కడ వేయాలో తెలియడంలేదు. ఇంటి ఆవరణలోనే ఉంచడంతో పేరుకుపోతోంది. చిన్నా పెద్ద అందరూ దోమలు కుట్టడంతో జ్వరాలు వచ్చి ఆస్పత్రికి పోవాల్సి వస్తోంది.

– ఎండీ.మొహీన్, గిర్నిగడ్డ



గిర్నిగడ్డ: ఇంట్లో పేరుకుపోయిన చెత్త

పేరుకే మున్సిపాలిటీ.. పట్టణంలోని పలు వార్డుల్లో పారిశుద్ధ్యం పడకేసి మురికి కూపాలుగా మారాయి. పారిశుద్ధ్య సిబ్బంది రాకపోవడంతో కొన్ని ప్రాంతాల్లో రోజుల తరబడి, మరికొన్ని ప్రాంతాల్లో నెలల తరబడి ఎక్కడి చెత్త అక్కడే కుప్పలుగా పేరుకుపోయింది. కొన్ని ఇళ్లలో చెత్తను యజమానులే తీసుకెళ్లి బహిరంగ ప్రదేశాల్లో పడవేస్తున్నారు. ఇక మురికి కాల్వల పరిస్థితి మరీ అధ్వానంగా ఉంది. సిల్ట్‌తో నిండిపోయి కాలనీలన్నీ కంపు కొడుతున్నాయి. దోమలు విపరీతంగా పెరిగిపోయి ప్రజలు జ్వరాల బారిన పడుతూ ఆస్పత్రులకు క్యూ కడుతున్నారు. జిల్లా కేంద్రంలో పారిశుద్ధ్య సమస్యపై 'సాక్షి' పరిశీలించింది.

– జనగామ రూరల్

కుక్కలు, కోతులు లాగేస్తున్నాయి..



సెయింట్ మేరీస్ స్కూల్‌కు వెళ్లే దారిలో డ్రెయినేజీ..

రోడ్డు పక్కనే సెయింట్ మేరీస్ స్కూల్‌కు వెళ్లే దారిలో పెద్ద మురికి కాల్వ ఉంది. ఈ ప్రాంతంలో చెత్త డబ్బాలు పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయలేదు. ఉన్న డబ్బాలు చెత్తతో నిండినా తొలగించకపోవడంతో కుక్కలు, కోతులు బయటకు లాగేస్తున్నాయి. మురికి కాల్వలోకి చెత్త చేరడంతో ప్రవాహానికి అడ్డంకిగా మారుతోంది. దోమలు పెరిగి పోయాయి.

– ఫకీరు యాదగిరిరెడ్డి, హైదరాబాద్ రోడ్డు(2వ వార్డు)

అండర్ బ్రిడ్జి కింద పోగైన చెత్త



దుర్వాసన భరించలేక పోతున్నం..



సిద్దిపేట వైపు ఉన్న అండర్ బ్రిడ్జ్ ఏరియా ఆస్పత్రి పక్కన చెత్త పేరుకుపోతోంది. చెత్త డబ్బాలు ఏర్పాటు చేయక పోవడంతో పరిసర ప్రాంతాల నుంచి తెచ్చి ఇక్కడ వేస్తున్నారు. తొలగించడానికి మున్సిపల్ సిబ్బంది రావడంలేదు. రోడ్డు మీదుగా వెళ్తుంటే దుర్వాసన భరించలేక పోతున్నం. డ్రెయినేజీలు కూడా శుభ్రం చేయడంలేదు. సాయంత్రం అయితే షాపు వద్ద నిలబడలేక పోతున్నాం.

– ఎర్ర సందీప్, బైక్ షాపు యజమాని, అండర్ బ్రిడ్జ్ ఏరియా

డెంగీ కేసు నమోదు అయింది



ధర్మకంచ ఏరియాలో 15 రోజుల క్రితం ఒక డెంగీ కేసు నమోదైంది. సాధారణ జ్వరంలా వచ్చింది. వెంటనే ఇంటి పరిసరాలను శుభ్రం చేయించాం. జిల్లాలో ఎలాంటి ప్రాణాంతకమైన వ్యాధులు రాలేదు. ప్రజలు పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలి.

– డాక్టర్ సుగుణాకర్‌రాజు, జిల్లా మలేరియా ప్రోగ్రాం అధికారి

నా భర్తకు జ్వరం వచ్చింది



మా కురుమవాడలో 26, 29 వార్డులు కలిసి ఉంటాయి. పారిశుద్ధ్య పనులు నిత్యం చేపట్టకపోవడంతో కాల్వల్లో చెత్తా చెదారం చేరుతోంది. మురుగు నీరు నిలిచి దుర్వాసన వస్తోంది. దోమలు పెరిగిపోయాయి. నా భర్తకు జ్వరం వచ్చింది. చికిత్స కోసం ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లాడు. ఈ మార్గంలో నిత్యం వందల మంది ప్రయాణిస్తారు. అందరూ ఇక్కడికి రాగానే ముక్కులు మూసుకుని వెళ్తున్నారు.

– రాపోతుల భాగ్యమ్మ, కురుమవాడ

సీఎం ఆదేశాల మేరకు పనిచేస్తా..

- ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి

తరిగొప్పుల: టికెట్ విషయంలో పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఉంటాను.. సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు పనిచేస్తాను.. తనపై జరుగుతున్న ప్రచారాలన్నీ ఊహాగానాలు మాత్రమేనని ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి అన్నారు. దేవాదుల ఎత్తిపోతల పథకంలో భాగంగా మండలంలోని బొత్తలపర్రె, బొంతగట్టునాగారం పరిధిలో నిర్మించనున్న సాగునీటి పైపులైన్ నిర్మాణ పనులకు ఆయన శనివారం భూమిపూజ చేశారు. అనంతరం మాట్లాడుతూ ముఖ్యమంత్రి రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టులకు పెద్దపీట వేస్తున్నారని, రూ.67.5 కోట్లతో నర్మెట మండలం గండిరామారం రిజర్వాయర్ నుంచి తరిగొప్పుల మండలం బొత్తలపర్రె వరకు పైపులైన్ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. వచ్చే వేసవిలోగా పనులు పూర్తయి రైతులకు సాగునీరు అందుబాటులోకి వస్తుందని చెప్పారు. మండల కేంద్రంతో పాటు అబ్దుల్‌నాగారం, నర్సాపూర్, సోలిపూర్, పోతారం, అంకుషాపూర్, బొత్తలపర్రె గ్రామాల్లోని చెరువులను నింపుతామని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి, సర్పంచులు భూక్య కమలరవి, ఇరుమల్ల బాలమణి, ఎంపీటీసీలు భూక్య జుంలాల్‌నాయక్, అర్జుల మధుసూదన్‌రెడ్డి, జొన్నగోని కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.



పైపులైన్ పనుల భూమిపూజలో ఎమ్మెల్యే..

గిరిజన తండాలకు మహర్దశ

- 'తండాబాట'లో మంత్రి దయాకర్‌రావు

దేవరుప్పుల: బీఆర్‌ఎస్ ప్రభుత్వం హయాంలోనే గిరిజన తండాలకు మహర్దశ వచ్చిందని రాష్ట్ర మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. 'తండాబాట' కార్యక్రమంలో భాగంగా శనివారం మాధాపురం, ధర్మాపురం పరిధి నూతన జీపీలు దుబ్బతండా, లాకావత్‌తండా, దేవునిగుట్ట, పొట్టిగుట్ట, సీత్యతండా, లక్ష్మణ్‌తండాల్లో పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపనలు చేసి మాట్లాడారు. కనీస మౌలిక వసతులు లేక తల్లడిల్లిన తండాలను ప్రత్యేక రాష్ట్రం వచ్చాక సీఎం కేసీఆర్ జీపీలుగా మార్చి సమస్యల నుంచి విముక్తి కల్పించారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో కాలంచెల్లిన సిద్ధాంతాలతో పాలన చేసిన పార్టీలకు తెలంగాణ ప్రజలు చరమగీతం పాడారని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఎస్టీల్లో వర్గీకరణ చిచ్చు పెడతారని, ఆ పార్టీ పాలిస్తున్న ప్రాంతాల్లో వేయి ఆసరా పింఛన్లు ఇవ్వనోళ్లు ఇక్కడ నాలుగు వేలు ఎలా ఇస్తారో ఆలోచించాలన్నారు. ఈ క్రమంలో.. మాకు పింఛన్, రుణమాఫీ ఇంకా కాలేదని పలువురు అడగ్గా.. అర్హులకు అందేలా నెలాఖరులోగా చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. దేవునిగుట్టతండాలో కొన్ని తండాలకే అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందాయని తండావాసులు ఆరోపించగా పరిశీలించి చేపడతామని చెప్పారు. పొట్టిగుట్టతండా జీపీ అనుబంధ తండాల్లో అభివృద్ధి పనులపై కాంగ్రెస్ సీనియర్ నాయకుడు వీర్యానాయక్, నర్సింహ ప్రశ్నించే సమయంలో ఉద్రిక్తత పరిస్థితి నెలకొనడంతో వారిని పోలీసులు స్టేషన్‌కు తరలించారు. తండాబాటలో ధారావత్‌తండా, లక్ష్మణ్‌తండాకు చెందిన కాంగ్రెస్ కార్యకర్తలు పలువురు బీఆర్‌ఎస్‌లో చేరారు. ఎర్రబెల్లి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఉపాధి కూలీలకు టిఫిన్, వాటర్‌బాటిల్ కిట్లు పంపిణీ చేశారు. అదనపు కలెక్టర్ సుహాసిని, ఎంపీపీ బస్వ సావిత్రిమల్లేషం, జెడ్పీటీసీ పల్ల భార్గవిసుందర్‌రామిరెడ్డి, వైస్‌ఎంపీపీ విజయ్, ఎంపీడీఓ సురేష్‌కుమార్, తహసీల్దార్ హుస్సేన్, బీఆర్‌ఎస్ నాయకులు దయాకర్, రవి, రామ్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా.. రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న అంజయ్యను మంత్రి మండల కేంద్రంలో సన్మానించారు.



మాట్లాడుతున్న మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

ఎన్నికల ఏర్పాట్లు వేగవంతం చేయాలి

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్

జనగామ : రానున్న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో అవసరమైన ఏర్పాట్లు వేగంగా చేపట్టాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శివలింగయ్య అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో ఎన్నికల నోడల్ అధికారులు, ఆర్‌ఓస్, ఈఆర్‌ఓస్, ఏసీపీలు, ఎన్నికల విభాగం సిబ్బందితో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్, పాలకుర్తి నియోజకవర్గాలకు సంబంధించి ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లా సరిహద్దులో చెక్ పోస్టుల నిర్వహణ, సీసీ కెమెరాల కవరేజీ, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను పోలీసు సిబ్బంది సిద్ధం చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ఫామ్–6, 7 క్లియర్ చేయడంతోపాటు సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి తగిన చర్యలు చేపట్టాలని తెలిపారు. సమావేశంలో డీసీపీ సీతారాం, అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్, ఆర్‌ఓలు మురళీకృష్ణ, రామ్మూర్తి, ఏసీపీలు దేవేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రావు, రఘుచంద్ర, నోడల్ అధికారులు వినోద్‌కుమార్, ఇస్మాయిల్, రాము, రంగాచారి, శ్రీనివాస్‌రావు, అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ శివలింగయ్య

'నిరుద్యోగులను రోడ్డుకీడ్చిన ఘనత కేసీఆర్‌దే'

జనగామ: గ్రూప్–1 ప్రిలిమ్స్ పరీక్ష రెండోసారి రద్దు చేసి నిరుద్యోగుల జీవితాలను రోడ్డుకీడ్చిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని ఏబీవీపీ ఉమ్మడి వరంగల్ జిల్లా కన్వీనర్ చింతకింది సంతోష్ అన్నారు. శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గతంలో టీఎస్పీఎస్సీ నిర్వహించిన గ్రూప్–1, ఇతర ప్రశ్నపత్రాలను అమ్ముకోవడానికి ప్రయత్నించి లక్షలాది మంది నిరుద్యోగుల జీవితాలను రోడ్డున పడేసిందన్నారు. బాధ్యులపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేసినా పట్టించుకోని ప్రభుత్వం మరోసారి టీఎస్పీఎస్సీతో కుమ్మక్కై కుట్రపూరితంగా రెండోసారి పరీక్ష రద్దు కావడానికి కారణమైందని దుయ్యబట్టారు.

గంజాయి రవాణాదారుడి అరెస్టు, రిమాండ్

- పరారీలో ముగ్గురు నిందితులు
- 15 కిలోల గంజాయి స్వాధీనం
- ఐదుగురిపై కేసు నమోదు : ఏసీపీ

స్టేషన్‌ఘన్‌పూర్: రైలులో అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్న రాజ్‌కుమార్‌కోల్ అనే వ్యక్తిని స్థానిక పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఏసీపీ శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు ఆయన శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. ఈనెల 22న స్థానిక రైల్వేస్టేషన్ వద్ద ఓ వ్యక్తి గంజాయితో ఉన్నట్లు సమాచారం అందగా పోలీసులు వెళ్లి అదుపులోకి తీసుకుని విచారించారని చెప్పారు. మధ్యప్రదేశ్ రాష్ట్రం కట్నీ జిల్లా ఇటావురాకు చెందిన రాజ్‌కుమార్‌కోల్ పూణేలోని ఒక జ్యూస్ కంపెనీలో పనిచేస్తుండగా.. ఆ షాపు యజమాని యూనిస్‌ఖాన్ మరో ఇద్దరిని పరిచయం చేసి వారితో ఒడిషాకు వెళ్లి గంజాయి తేవాలని చెప్పాడు. డబ్బు ఆశ చూపడంతో రాజ్‌కుమార్‌కోల్ అక్కడికి వెళ్లి దశరథ్ అనే వ్యక్తి వద్ద గంజాయి తీసుకుని కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో వస్తున్నారు. రైలు కాజీపేట సమీపానికి వచ్చేసరికి తనతో వచ్చిన మిగతా ఇద్దరు కనిపించకపోవడంతో ఆందోళన చెందిన రాజ్‌కుమార్‌కోల్ రైలు ఘన్‌పూర్ సమీపానికి రాగానే చైన్ లాగి స్టేషన్‌లో తనవద్ద ఉన్న గంజాయి సంచితో దిగాడు. సమాచారం అందుకున్న పోలీసులు అతడిని అరెస్టు చేసి విచారించినట్లు ఏసీపీ వివరించారు. నిందితుడి వద్ద 15 కిలోల గంజాయి, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకుని స్థానిక తహసీల్దార్ సమక్షంలో పంచనామా చేసి గంజాయిని సీజ్ చేసినట్లు తెలిపారు. అయితే నిందితుడితో వచ్చిన మరో ఇద్దరి వివరాలు తెలియాల్సి ఉందని, పరారీలో ఉన్నట్లు పేర్కొన్నారు. రాజ్‌కుమార్‌కోల్, యూనిస్‌ఖాన్, దశరథ్‌తోపాటు పరారీలో ఉన్న ఇద్దరిపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా సీఐ రాఘవేందర్, ఎస్‌ఐ నాగరాజు, కానిస్టేబుళ్లు రవిప్రసాద్, కుమార్, సల్మాన్‌పాషా, ఆర్‌పీఎఫ్ సీఐ టీఎస్‌ఎన్ కృష్ణ తదితరులను ఏసీపీ అభినందించారు.



నిందితుడి అరెస్టు చూపుతున్న ఏసీపీ, సీఐ

ఓడిపోవద్దనే సీటు మార్పు

- మూడు స్థానాల్లో బీఆర్‌ఎస్ గెలవాలి
- నియోజకవర్గ నాయకులతో 'పల్లా'

జనగామ: జనగామలో ఓడిపోకూడదనే సీఎం కేసీఆర్ టికెట్ మార్పు నిర్ణయం తీసుకున్నారని ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. జనగామ నియోజకవర్గ పరిధి 8 మండలాల నుంచి బీఆర్‌ఎస్ ముఖ్య నాయకులు శనివారం హైదరాబాద్‌లోని తన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టికెట్ ఇస్తే గెలిచేది ఎవరనే దానిపై ఆలోచిస్తారే తప్ప.. సార్(కేసీఆర్)కు దగ్గరగా ఉండడంతోనే అవకాశం వచ్చిందని ఊహించడం సరికాదన్నారు. నాకు బాధ్యత అప్పగిస్తే విజయం సాధ్యమవుతుందనే విషయం సార్‌కు తెలుసన్నారు. ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి అంటే సీఎంకు గౌరవమని, తెలంగాణ ఉద్యమంతోపాటు ఎమ్మెల్యేగా జనగామకు పదేళ్లకుపైగా సేవ చేస్తున్నాడని పేర్కొన్నారు. ముత్తిరెడ్డితోపాటు కేసీఆర్ ఆశీర్వాదంతోనే ముందుకు వెళ్దామన్నారు. జనగామ సీటు గెలిపించుకునే బాధ్యత మనందరిపై ఉందని చెప్పారు. జనగామ టికెట్ డిక్లేర్ అయ్యే వరకు ఎవరు తప్పుపట్టినా.. దీవెనలుగా భావించాలే తప్ప వ్యతిరేకమైన పోస్టులు పెట్టొద్దని సూచించారు. స్టేషన్‌ఘన్‌పూర్ టికెట్ కడియం శ్రీహరికి ప్రకటించిన నేపథ్యంలో ప్రస్తుతం ఎమ్మెల్యే రాజయ్యను గౌరవించుకోవాలనే ఉద్దేశంతో రైతు సమన్వయ సమితి రాష్ట్ర అధ్యక్ష పదవి ఇస్తామని సీఎం చెప్పగా ఆయన అంగీకరించారని పేర్కొన్నారు. ఆయన వెంట జెడ్పీ చైర్మన్, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు పాగాల సంపత్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ నిమ్మతి మహేందర్‌రెడ్డి, సేవెల్లి సంపత్, దీపక్‌రెడ్డి, ఇర్రి రమణారెడ్డి, జార్జిరెడ్డి, శ్రీధర్‌రెడ్డి, వడ్డెపల్లి మల్లారెడ్డి, నరెడ్ల బాల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న పల్లా రాజేశ్వర్‌రెడ్డి

దివ్యాంగుల్లో చైతన్యం నింపాలి

- జనగామ సీనియర్ సివిల్ జడ్జి విక్రమ్

జనగామ: దివ్యాంగులను జాలితో చూడకుండా వారిలో చైతన్యం నింపాలని జనగామ సీనియర్ సివిల్ జడ్జి విక్రమ్ అన్నారు. శనివారం వరల్డ్ డెఫ్ డే సందర్భంగా కలెక్టరేట్ వద్ద మార్కస్ హోప్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వినికిడి లోపం ఉన్న వారి హక్కులను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని చెప్పారు. ఒకప్పుడు సమాజంలో చులకనగా, హేళనగా చూడబడిన వీరు వినికిడి విజ్ఞానం పెరగడంతో ఆత్మగౌరవాన్ని పొందగలుగుతున్నారని పేర్కొన్నారు. మంచాల రవీందర్, ఇట్టబోయిన జ్యోత్స్న, మేకల సమ్మయ్య, తెలంగాణ రాష్ట్ర వికలాంగుల వేదిక వ్యవస్థాపక అధ్యక్షురాలు సుమలత తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న జడ్జి విక్రమ్

గిర్నిబావిలో పోలీసుల తనిఖీ..

● రూ. 18.90 లక్షల నగదు పట్టివేత

దుగ్గొండి : మండలంలోని గిర్నిబావిలో శనివారం వరంగల్–నర్సంపేట ప్రధాన రహదారిపై సీఐ పూల్యాల కిషన్ ఆధ్వర్యంలో పోలీసులు విస్తృత తనిఖీలు చేపట్టారు. కార్లు, ద్విచక్రవాహనాలు, లారీలు, జీపులను ఆపి క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ క్రమంలో వరంగల్ నుంచి నర్సంపేట వైపునకు వెళ్తున్న టీఎస్ 04ఈజె6918 నంబర్ గల కారును ఆపి తనిఖీ చేయగా రూ. 15.60 లక్షల నగదు లభించింది. దీంతో కారులో ప్రయాణికుస్తున్న కన్నెటి ప్రభాకర్‌రావు, లక్ష్మణ్‌రావును వివరణ కోరగా తాము మిర్చి వ్యాపారులమని, వరంగల్ నుంచి ఖమ్మం వెళ్తున్నామని చెప్పారు. అలాగే, కంచరకుంట్ల మురళీధర్‌రెడ్డి వాహనంలో రూ. 2లక్షలు, మల్లాది రాజేందర్‌రెడ్డి వాహనంలో రూ. 1.30లక్షలు లభించగా మొత్తం రూ. 18.90 లక్షలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. విషయం తెలుసుకున్న నర్సంపేట ఏసీపీ తిరుమల్ గిర్నిబావికి చేరుకుని నగదుపై ఆధారాలు చూపాలని సదరు వ్యక్తులను అడిగారు. అయితే వారు చూపిన ఆధారాలు నమ్మకంగా లేకపోవడంతో కేసు నమోదు చేయాలని సీఐ కిషన్‌ను ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడారు. పూర్తి ఆధారాలు చూపితే నగదును అందజేస్తామన్నారు. ఆధారాలు లేకుండా డబ్బుతో ప్రయాణించొద్దన్నారు. కార్యక్రమంలో దుగ్గొండి, నల్లబెల్లి, ఖానాపురం ఎస్సైలు జక్కుల పరమేష్, నగేష్, మధు, సిబ్బంది పాల్గొన్నారు.



నగదును పరిశీలిస్తున్న ఏసీపీ తిరుమల్

అదును చూసి అపహరణ..

● తాళం వేసి ఉన్న ఇంట్లో భారీ చోరీ
● 375 గ్రాముల బంగారం, 700 గ్రాముల వెండి అపహరణ
● ఘటనా స్థలిని పరిశీలించిన ఏసీపీ డేవిడ్‌రాజ్

ఎల్కతుర్తి : ఇంటి యజమాని అనారోగ్యానికి గురయ్యారు. దీంతో చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేరారు. ఈ సమయంలో ఇంటి తాళం వేసి వెళ్లారు. ఇంకేముంది.. ఇదే అదునుగా భావించిన దుండగులు భారీ చోరీకి పాల్పడ్డారు. 375 గ్రాముల బంగారం, 700 గ్రాముల వెండిని అపహరించారు. దీంతో బాధితులు లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయించారు. ఈ ఘటన భీమదేవరపల్లి మండలం కొత్తకొండ గ్రామంలో జరిగింది. ఎస్సై సాయిబాబు కథనం ప్రకారం గ్రామానికి చెందిన మంచాల వెంకటేశ్వర్లు అనారోగ్యానికి గురికాగ చికిత్స నిమిత్తం ఈనెల 12న హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేరారు. ఇదే అదునుగా భావించిన దుండగులు ఇంట్లో చొరబడి బీరువాలో ఉన్న 375 గ్రాముల బంగారం, 700 గ్రాముల వెండి అపహరించుకెళ్లారు. ఇదిలా ఉండగా చికిత్స పొందిన అనంతరం ఈ నెల 22వ తేదీన బాధితులు ఇంటివచ్చి చూడగా తాళం పగలగొట్టి ఉంది. అనుమానం వచ్చి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో కాజీపేట ఏసీపీ డేవిడ్‌రాజ్, సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్సై సాయిబాబు ఘటనా స్థలానికి చేరుకుని చోరీ జరిగిన తీరును పరిశీలించారు. అనంతరం బాధితుల ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



ఘటనా స్థలిని పరిశీలిస్తున్న ఏసీపీ డేవిడ్‌రాజ్

టాస్క్‌ఫోర్స్ సీఐపై వరంగల్ సీపీకి ఫిర్యాదు

వరంగల్ క్రైం: టాస్క్‌ఫోర్స్ సీఐ అల్లం రాంబాబుపై అడ్వకేట్ కిషన్ కుమార్‌గౌడ్ శనివారం సీపీ రంగనాథ్‌కు ఫిర్యాదు చేశారు. రిటైర్డ్ డీఆర్ పరిటాల సుబ్బారావు భూమి విషయంలో తగదా రావడంతో టాస్క్‌ఫోర్స్ సీఐ రాంబాబు తన కార్యాలయంలో సుబ్బారావును ఇష్టానుసారంగా మాట్లాడారు. దీనిపై కిషన్‌కుమార్‌గౌడ్, సుబ్బారావు సీపీకి ఫిర్యాదు చేశారు. స్పందించిన సీపీ రంగనాథ్.. ఇన్‌స్పెక్టర్ రాంబాబుపై విచారణకు ఆదేశించినట్లు సమాచారం.

మళ్లీ మొదటికి..

అభ్యర్థుల సమయం, శ్రమ బూడిదలో పోసిన పన్నీరే..

● ఇప్పటికే రెండుసార్లు రాసిన గ్రూప్–1 ప్రిలిమ్స్
● ఇప్పుడు మళ్లీ రద్దుతో విసిగిపోతున్న నిరుద్యోగులు
● కోచింగ్ కోసం వేలాది రూపాయలు ఖర్చు
● నిరుద్యోగిపై అదనపు భారం పడుతుందని ఆవేదన



పరీక్ష రాస్తున్న ఉద్యోగార్థులు(ఫైల్)

జూన్‌లో జరిగిన గ్రూప్–1 పరీక్షకు హాజరైన అభ్యర్థులు			
జిల్లా	మొత్తం	హాజరైంది	సెంటర్లు
వరంగల్, హనుమకొండ	21,038	13,929	55
భూపాలపల్లి	2369	1516	09
ములుగు	1,931	1,262	07
జనగామ	2330	1079	14
మహబూబాబాద్	4046	2663	13

సాక్షి, మహబూబాబాద్/హనుమకొండ/వరంగల్: సుదీర్ఘ కాలం తర్వాత తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన గ్రూప్–1 ఉద్యోగాల భర్తీ పరీక్ష ఒక్క అడుగు ముందుకు.. నాలుగు అడుగులు వెనక్కి అన్నట్లు సాగుతోంది. సివిల్స్‌లో విఫలమైన వారు కొందరు.. ప్రస్తుతం చేస్తున్న ఉద్యోగానికి సెలవు పెట్టి మరికొందరు.. యూనివర్సిటీలు, కోచింగ్ సెంటర్లలో ఏళ్ల తరబడి ఉంటూ.. ఉద్యోగం కోసమే జీవితం అన్నట్లు కఠోర శ్రమ చేస్తున్న ఇంకొందరు.. ఇలా అందరూ ఇప్పటికే రెండు సార్లు పరీక్ష రాసి మెయిన్స్ కోసం చదువుతున్నారు. ఈ నేపథ్యంలో 'గతంలో నిర్వహించిన ప్రిలిమ్స్ రద్దు చేస్తున్నాం. మళ్లీ రాయాలని' హైకోర్టు తీర్పు ఇవ్వడంపై కన్నీరుమున్నీరవుతున్నారు. మళ్లీ పరీక్ష మొదటి నుంచి రాయాలా అని నిస్సాహాయత తెలియజేస్తున్నారు.

ప్రభుత్వ వైఫల్యానికి యువత బలి

సర్కారు.. పరీక్షలు పకడ్బందీగా నిర్వహించడంలో విఫలమైంది. అసలు పరీక్ష పేర్లతో సంబంధం లేకుండా కొందరికి.. పేపర్‌ను లీక్ చేసి మరికొందరికి ఉద్యోగాలు ఇవ్వాలని చూసింది. అధికారుల నిర్లక్ష్యంతో పరీక్ష పేపర్లు అంగట్లో సరుకయ్యాయి. ఫలితంగా ఒకే పరీక్షను మూడు సార్లు రాయమని నిరుద్యోగులకు చెప్పి వారి సమయం, ధనం, శ్రమ వృథా చేస్తున్నారు. దీనికి ప్రభుత్వమే మూల్యం చెల్లించాల్సి ఉంటుందని యువత డిమాండ్ చేస్తోంది.

సంవత్సరాల తరబడి చదువు

గ్రూప్–1 ఉద్యోగం సాధించాలని యువత భారీగా ఆశలు పెట్టుకుంది. ఇప్పటికే ఉపాధ్యాయులు, ఎస్సైలు, కానిస్టేబుళ్లు, ఐసీడీఎస్, ఏసీటీవోలతోపాటు వివిధ కేటగిరీల్లో ఉద్యోగాలు చేసేవారు. గ్రూప్–1 నోటిఫికేషన్ వచ్చినప్పటి నుంచి ఉద్యోగాలకు సెలవు పెట్టి లక్షలాది రూపాయలు ఖర్చుపెట్టి చదువుతున్నారు. అదేవిధంగా ఉద్యోగ సాధనే ధ్యేయంగా నాలుగు పదుల వయసువచ్చినా..పెండ్లి చేసుకోకుండా యూనివర్సిటీల్లో పాగావేసి గడ్డం, మీసాలు పెంచుకొని కొందరు.. నెత్తిపై ఉన్న వెంట్రుకలు రాలిపోయే అంత టెన్షన్‌తో మరికొందరు చదువుతున్నారు. ఇందుకోసం కోచింగ్ సెంటర్లు, మెటీరియల్స్ కోసం లక్షలాది రూపాయలు అప్పులు చేసిన వారు కూడా ఉన్నారు. ఇప్పుడు మళ్లీ ప్రిలిమ్స్ రద్దు అంటే అందరి జీవితాలతో ఆడుకోవడమే.

టీఎస్‌పీఎస్సీని రద్దు చేయాలి



గ్రూప్–1 రద్దు అత్యంత బాధాకరం. ఇప్పటికి రెండుసార్లు రాసిన. మళ్లీ రాయాల్సిన పరిస్థితి రావడం దారుణం. దీనిపై ప్రభుత్వం స్పందించి టీఎస్‌పీఎస్సీని రద్దు చేయాలి. లేదా కమిషన్ చైర్మన్ తొలగించి నూతన నోటిఫికేషన్ జారీ చేయాలి.

– మారపాక కిశోర్, కురవి

ఆసక్తి సన్నగిల్లుతోంది



రెండోసారి గ్రూప్–1 ప్రిలిమ్స్ రద్దు వల్ల చదువుకోవాలనే ఆసక్తి సన్నగిల్లుతోంది. ఇంత అధ్వానంగా పరీక్షలు నిర్వహించడాన్ని గతంలో ఎప్పుడూ చూడలేదు. ఇప్పటి వరకు రూ.3 లక్షలు ఖర్చయ్యాయి. టీఎస్‌పీఎస్సీ వైఫల్యం స్పష్టంగా కనిపిస్తోంది.

– తిరుపతి రెడ్డి, గణపురం, భూపాలపల్లి

ఆశ చచ్చిపోయింది



నేను ఉపాధ్యాయుడిని. కొంతకాలంగా గ్రూప్–1 పరీక్షలకు సిద్ధమవుతున్న. ఈ క్రమంలో మరోసారి గ్రూప్–1 రద్దు కావడం వల్ల ఉద్యోగం సాధించాలనే ఆశ చచ్చిపోయింది. ఉన్నత ఉద్యోగాల భర్తీలో ఇలా జరగడం ప్రభుత్వం, టీఎస్‌పీఎస్సీ చిత్తశుద్ధి కనిపిస్తోంది.

– పి.చక్రపాణి, వరంగల్

ఒక్క పరీక్షను ఎన్నిసార్లు రాపిస్తారు



ఒక్క గ్రూప్–1 ప్రిలిమ్స్‌ను ఎన్నిసార్లు రాపిస్తారు.. ఇది ప్రభుత్వమేనా.. నిర్వహించేవి ఉద్యోగాల భర్తీ పరీక్షేనా.. గ్రూప్–1 పరీక్ష రద్దడం అత్యంత దారుణం. వరుసగా విఫలమవుతున్న ప్రభుత్వానికి యువత బుద్ధి చెబుతారు.

– ఆవుల వేణు, మహబూబాబాద్

నిరుద్యోగులు రోడ్డున పడుతున్నారు



గ్రూప్–1 ప్రిలిమ్స్ ఫలితాలు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న తరుణంలో టీఎస్‌పీఎస్సీ నిర్వహించిన పరీక్షను హైకోర్టు రద్దు చేసింది. ఈ పరిణామం మానసికంగా ఆందోళనకు గురి చేసింది. పరీక్షకు మళ్లీ సన్నద్ధం కావాలంటే క్లిష్ట పరిస్థితులను ఎదుర్కోవాలి. కొందరు చేసిన తప్పిదాలకు లక్షలాది మంది నిరుద్యోగులు రోడ్డున పడుతున్నారు.

– బెల్లపురి సాయికుమార్, జనగామ

మళ్లీ మొదటి నుంచి చదవాలి



గ్రూప్–1 నోటిఫికేషన్ ఇచ్చి రెండేళ్లు దాటింది. నోటిఫికేషన్ వచ్చినప్పటి నుంచి కోచింగ్‌కు వెళ్లి పరీక్ష రాస్తున్నాం. ఇప్పటి వరకూ పూర్తి కాలేదు. పరీక్షలు ఇప్పటికే రెండు సార్లు రద్దు అయ్యాయి. దీంతో మళ్లీ రాయాలంటే మొదటి నుంచి చదవాలి. ఉద్యోగాలు ఇవ్వొద్దని ఉద్దేశంతోనే ఇదంతా జరుగుతున్నట్లు అనిపిస్తోంది.

– కె.శ్రీజిత, విద్యార్థిని, హనుమకొండ

కూలికి వెళ్లొస్తా..జాగ్రత్త బిడ్డా..!

కూతురికి జాగ్రత్తలు చెప్పి పనికి వెళ్తూ మహిళ దుర్మరణం..

● నాయుడు పెట్రోల్ బంక్ సమీపంలో రోడ్డు ప్రమాదం.. అక్కడికక్కడే మృతి
● మరో ఇద్దరికి స్వల్ప గాయాలు
● 108లో ఎంజీఎంకు తరలింపు



ఘటనా స్థలిలో మహిళ మృతదేహం

ఖిలా వరంగల్: జాగ్రత్తగా బడికి పోయిరా.. కూలికి వెళ్లొస్తా అంటూ ..బిడ్డకు జాగ్రత్తలు చెప్పి పనికి బయల్దేరిన మహిళను మృత్యువు.. ఆర్టీసీ బస్సు రూపంలో కబలించింది. ఈ ఘటన వరంగల్–ఖమ్మం జాతీయ రహదారిపై నాయుడు పెట్రోల్ బంక్ సమీపంలో జరిగింది. ఆర్టీసీ బస్సు అదుపు తప్పి ద్విచక్రవాహనాన్ని ఢీకొనడంతో దంపతులు స్వల్పగాయాలతో బయటపడగా, ఓ మహిళ అక్కడికక్కడే దుర్మరణం చెందింది. ముగ్గురు ఒకే కుటుంబానికి చెందిన వారు కావడంతో ఆ ఇంట్లో తీవ్ర విషాదం నెలకొంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం చెన్నారావుపేట మండలం సమీప గ్రామాలకు చెందిన బానోతు సుజాత, బాలు దంపతులు బతుకుదెరువు కోసం ఐదేళ్ల క్రితం హనుమకొండ వడ్డేపల్లికి చేరుకున్నారు. ఇక్కడే ఉంటూ భవన నిర్మాణ కార్మికులుగా పనిచేస్తూ ఇద్దరి పిల్లలను చదివించుకుంటున్నారు. బానోత్ సుజాత సొంత అక్క భూక్య బుజ్జీ (35). బుజ్జీ తన భర్తకు దూరంగా ఉంటూ తన ఇద్దరు కూతుళ్లను తీసుకుని మూడేళ్ల క్రితం వడ్డేపల్లికి చేరుకుంది. పెద్ద కూతురు భాను 7వ తరగతి చదువుతుండగా చిన్న కూతురును బంధువులకు దత్తత ఇచ్చింది. ఈ క్రమంలో సుజాత, బాలు, బుజ్జీ ముగ్గురు కలిసి ఒకే ద్విచక్రవాహనంపై భవన నిర్మాణ పనికి వెళ్తుంటారు. రోజువారీగానే శనివారం ఉదయం 9 గంటల సమయంలో ఒకే బైక్‌పై వడ్డేపల్లి నుంచి మామునూరుకు బయలుదేరారు. ఈ క్రమంలో వరంగల్–ఖమ్మం జాతీయ రహదారిపై నాయుడు పెట్రోల్ బంక్ సమీపంలో వరంగల్ నుంచి తొర్రూరు వైపునకు వెళ్తున్న ఆర్టీసీ బస్సు.. బైక్‌ను ఢీకొంది. దీంతో భార్యాభర్తలు సుజాత, బాలు రోడ్డుపై పడిపోగా.. బుజ్జీ బస్సు వెనక టైర్ కింద పడింది. దీంతో అక్కడికక్కడే దుర్మరణం చెందింది. స్వల్పగాయాలతో బయటపడిన భార్యాభర్తలను స్థానికులు వెంటనే 108లో ఎంజీఎం తరలించారు. ఈ విషయం తెలిసిన మృతురాలి కుమార్తె భాను.. తల్లి మృతదేహంపై పడి కన్నీరు మున్నీరుగా విలపించింది. రోడ్డు ప్రమాద విషయం తెలియగానే మామునూరు ఎస్సైలు కృష్ణవేణి, ప్రమోద్‌కుమార్ హుటాహుటినా ఘటనా స్థలికి చేరుకున్నారు. మహిళ మృతదేహాన్ని ఎంజీఎం మార్చురీకి తరలించారు. అనంతరం మృతురాలి బంధువు బాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సైలు తెలిపారు.

పెద్ద దిక్కు కోల్పోయి..

హన్మకొండ వడ్డేపల్లిలో ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్న భూక్య బుజ్జీ(35).. భవన నిర్మాణ కార్మికురాలిగా పనిచేస్తూ కుమార్తెను చదివిస్తోంది. తన కూతురును ఉన్నతంగా చూడాలకుంది. ఇంతలోనే కనిపించని లోకాలకు వెళ్లింది. బిడ్డను బడికి సాగనంపి చెల్లి, మరిదితో కలిసి బైక్‌పై బయల్దేరిన బుజ్జీ.. కొద్ది నిమిషాల్లోనే రోడ్డు ప్రమాదంలో మృతి చెందింది. దీంతో కూతురు 7 ఏళ్ల చిన్నారి భాను పెద్దదిక్కును కోల్పోయింది.

డ్రైవర్‌ను చితకబాదిన బాధితులు

అతివేగంగా.. నిర్లక్ష్యపు డ్రైవింగ్‌తోనే రోడ్డు ప్రమాదం జరిగిందంటూ ఆగ్రహానికి లోనైన బాధితులు, స్థానికులు.. ఆర్టీసీ బస్సు డ్రైవర్‌ను చితకబాదారు. వెంటనే పోలీసులు జోక్యం చేసుకుని బాధితులు, స్థానికులను ఘటనా స్థలి నుంచి దూరంగా పంపించడంతో గొడవ సద్దుమణిగింది.

మహిళా కార్మికులపై వేధింపులు అరికట్టాలి



మాట్లాడుతున్న రజిత

హన్మకొండ: సంఘటిత, అసంఘటిత రంగాల్లో మహిళా కార్మికులపై జరుగుతున్న వేధింపులను అరికట్టాలని సీఐటీయూ అనుబంధ శ్రామిక మహిళా హనుమకొండ జిల్లా కన్వీనర్ ఎస్.రజిత అన్నారు. హనుమకొండ రాంనగర్‌లోని సుందరయ్య భవన్‌లో శ్రామిక మహిళా జిల్లా సదస్సు శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళా కార్మికులపై పురుష కార్మికులు, యజమాన్యాలు ద్వంద్వర్థాల మాటలతో వేధింపులకు గురి చేస్తూ అనేక విధాలుగా హింసకు గురి చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వేధింపులకు పాల్పడుతున్న వారిపై కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సదస్సులో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఉప్పలయ్య, యునైటెడ్ బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు వెంకన్న, భూక్య సునీత పాల్గొన్నారు.

పటిష్ట జాబితాను సిద్ధం చేయండి..

వరంగల్ అర్బన్: వరంగల్ తూర్పు నియోజకవర్గంలో పటిష్ట ఓటరు జాబితాను రూపొందించాలని ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్, రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ ప్రత్యేక కార్యదర్శి శ్రీధర్ సూచించారు. శనివారం బల్దియా కార్యాలయంలో వరంగల్ తూర్పు, అసెంబ్లీ ఓటర్ల జాబితాపై ఈఆర్‌ఓలు, ఏఈఆర్‌ఓలు, సూపర్‌వైజర్లు, బీఎల్‌ఓలతో సమీక్షించారు. ఈసందర్భంగా ఆయన పోలింగ్ బూత్‌ల వారీగా ఆయా ఓటరు నమోదు, మార్పులు చేర్పుల గురించి అడిగి తెలుసుకున్నారు. సమీక్షలో జీడబ్ల్యూఎంసీ కమిషనర్ రిజ్వాన్ బాషా, అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, ట్రెయినీ కలెక్టర్ శ్రద్ధాశుక్ల, తహసీల్దార్లు ఇక్బాల్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పేదల వ్యతిరేక ప్రభుత్వాలను ఓడించాలి

● రిటైర్డ్ ఐఏఎస్ ఆకునూరి మురళి



మాట్లాడుతున్న ఆకునూరి మురళి

నయీంనగర్: పేదల వ్యతిరేక కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఓడించాలని రిటైర్డ్ ఐఏఎస్ ఆకునూరి మురళి పిలుపునిచ్చారు. శనివారం హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణలో అవినీతి, ఆర్థిక దోపిడీ రాజకీయాలను ఓడించాలని జాగో తెలంగాణ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కులాలు, మతాల వారీగా విభజన రాజకీయాలు చేస్తున్నాయని, వాటిని ఓడించాలన్నారు. రాష్ట్రంలో పేదరికం, నిరుద్యోగం, అవినీతి పెరిగిపోయిందని, ప్రతి ఒక్కరూ గ్రహించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం దేశాన్ని ప్రైవేట్‌కు అప్పగిస్తోందని, ప్రధాని మోదీ నిర్ణయాలను తిప్పికొట్టాలన్నారు. రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోందన్నారు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసి పథకాల పేరుతో ప్రజలను మభ్యపెడుతున్నారన్నారు. విద్యారంగాన్ని నిర్వీర్యం చేసి రాష్ట్రాన్ని రూ. 5 లక్షల కోట్ల అప్పుతో లూటీ చేశారని మండిపడ్డారు. రిటైర్డ్ జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో రైతు ఆత్మహత్యలు, నిరుద్యోగం పెరిగిపోయిందని, ప్రజల్లో సమానత్వం లేదన్నారు. అవినీతి లేని సమాజాన్ని నిర్మించడానికి యువత మేలుకోవాలన్నారు. దేశంలో 70 శాతం ఎమ్మెల్యేలు దోచుకోవాలనే ఆలోచనతోనే ఉన్నారని, ప్రజల సంక్షేమం వారికి పట్టదన్నారు. దేశ అసలు జీడీపీ 4.8 అయితే దానిని పెంచి 7.8గా అసత్యప్రచారం చేస్తున్నారన్నారు. ప్రొఫెసర్ వినాయకరెడ్డి, కూరపాటి వెంకటనారాయణ మాట్లాడుతూ దేశం మొత్తంలో తెలంగాణ చదువులు లాస్ట్.. తాగడంలో ఫస్ట్ అన్నారు. తెలంగాణలో యువకులను తాగుడుకు బానిసలు చేశారని మండిపడ్డారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు యాదగిరిచార్యులు, పద్మజాషా, లక్ష్మీనారాయణ, డా.పృథ్వీరాజ్, సైబాబు, రమ, గోవర్ధన్ పాల్గొన్నారు.

రుద్రేశ్వరాలయ గణపతికి ఘన చరిత్ర

● ఇక్కడ నవరాత్రి ఉత్సవాలకు ప్రత్యేకత
● 55 సంవత్సరాల నుంచి నిర్వహణ..
● నిమజ్జనోత్సవ రథానికి వేలాది భక్తుల మంగళహారతులు

హన్మకొండ కల్చరల్ : స్వాతంత్రోద్యమంలో ప్రజలను ఏకం చేయడానికి లోకమాన్య బాలగంగాధర్ తిలక్ మహారాష్ట్రలో గణేష్ ఉత్సవాలు ప్రారంభించారు. ఈ ఉత్సవాల ద్వారా ప్రజలు చైతన్యం పొంది ఆంగ్లేయులపై పోరాడారు. అలాగే, ఈ ఉత్సవాలు నైజాం ప్రాంతాన్నీ ప్రభావితం చేశాయి. నైజాంకు వ్యతిరేకంగా జరిగిన స్వాతంత్ర్య పోరులో ఉద్యమకారులకు స్ఫూర్తినిచ్చాయి. ఆ స్ఫూర్తితో తెలంగాణలోని వరంగల్ జిల్లాలో కూడా ప్రారంభించారు.

వేయిస్తంభాల దేవాలయంలో..

హనుమకొండలోని వేయిస్తంభాల దేవాలయంలో జరిగే గణపతి నవరాత్రి ఉత్సవాలకు ప్రత్యేకత ఉంది. అలాగే, నిమజ్జనానికి కూడా ప్రత్యేక ఉంది. ఈ రోజున ఆలయంలో నిమజ్జనోత్సవ రథాన్ని దర్శించుకోవడానికి ప్రజలు మంగళహారతులతో ఎదురు చూస్తారు. వేలాది మంది భక్తులు వినాయకుడిని దర్శించుకుంటారు. పబ్లిక్‌గార్డెన్ వద్ద నిర్వహించిన గణేష్ ఉత్సవాలను 55 సంవత్సరాల క్రితం వేయిస్తంభాల దేవాలయానికి మార్చగా అప్పటి నుంచి గజానన మండలి ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం దేవాదాయశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఏటా దాతల సహకారంతో గణపతి విగ్రహాన్ని ఆలయంలో ప్రతిష్ఠిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా రోజూ గణపతి రుద్రహోమం, వేలాది మంది భక్తులకు అన్నప్రసాదాల వితరణ జరుగుతోంది. అలాగే, దేవాలయంలోని కాకతీయుల కాలం నాటి మూలమహాగణపతిని వివిధ రూపాల్లో అలంకరించి పూజలు నిర్వహిస్తారు. ఉత్సవాల సందర్భంగా రుద్రేశ్వరస్వామి వారికి అన్నపూజలు నిర్వహిస్తారు. జిల్లా యంత్రాంగం, నగరపాలక సంస్థలు ఏర్పాట్లు చేస్తాయి. రాష్ట్ర భాషా, సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరుగుతాయి.

ఏటా వైభవంగా ఉత్సవాలు..



ఉత్సవాల్లో తొమ్మిది రోజులు గణపతి, రుద్ర హోమాలు, మూలమహాగణపతికి అలంకరణలు జరగడం ఇక్కడి ప్రత్యేకత. వినాయకుడి పంచలోహ ఉత్సవ విగ్రహాన్ని ప్రతిష్ఠించి ఆలయ చుట్టూ పల్లకీసేవ నిర్వహిస్తాం. దాతల సహకారంతో ఏటా ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నాం.

గంగు ఉపేంద్రశర్మ, ప్రధానార్చకుడు, వేయిస్తంభాల ఆలయం

దళితులను దగా చేస్తున్న సీఎం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్

నయీంనగర్: సీఎం కేసీఆర్ హామీలు నీటి మూటలేనని, 17లక్షల మంది దళితులకు దళితబంధు పథకం అమలు చేయకుండా వారిని దగా చేస్తున్నారని బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్ విమర్శించారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దళితబంధు కింద మంజూరైన యూనిట్‌ను అమ్మి ఐదుగురు పంచుకోవాలని చెప్పడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. వర్ధన్నపేటలో దళిత ఎమ్మెల్యే ఉండికూడా దళితులకు అన్యాయం జరుగుతోందని వాపోయారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చిటూరి అశోక్ కుమార్, బన్న ప్రభాకర్, విజయ్ కిరణ్, బల్లె విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.